సాక్షి
వరంగల్
శనివారం । 22 । ఏప్రిల్ । 2023



సమష్టి కృషితోనే అభివృద్ధి

డీజిల్ లోకో షెడ్ భవిష్యత్ అభివృద్ధికి అందరం సమష్టి కృషి చేస్తామని షెడ్ సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్ అన్నారు. - IIలో▸



పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తే ఊరుకోం

- IIలో▸

ఇళ్ల పట్టాల సర్వే పేరుతో ఇందిరమ్మ లబ్ధిదారులను మోసం చేసే కుట్ర చేయడం సరికాదని తమ్మినేని వీరభద్రం అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.5^0 / 25.0^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండి వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి



నర్సంపేట: నర్సంపేట డివిజన్‌లో మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నర్సంపేట డివిజన్‌లో మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి మిర్చి పంటలకు ఎలాంటి వైరస్ సోకకుండా అరికట్టేందుకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అధికారులు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మిర్చి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొర్ర ఆనంద్, ఈరెల్లి రామచందర్, భూమ అశోక్, పిండి బాలకొమురు, సుక్క వీరన్న, బర్ల గౌరయ్య, శివరాత్రి కుమార్, ఎలకంటి కుమారస్వామి, అజ్మీర శివరాం, అజ్మీర ఫూల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



చెన్నారావుపేట: ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని లింగాపురం గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందించాలన్నారు. విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. అలాగే సూర్యాపేట తండాలో కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్, ఏఎన్‌ఎంలు, సిబ్బంది ఉన్నారు.

ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేసుకోవాలి



వర్ధన్నపేట: వ్యాపార వాణిజ్య సముదాయాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ పరికరాలను అమర్చుకోవాలని వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సినిమా థియేటర్, రైస్ మిల్, వాణిజ్య సముదాయ భవనాన్ని అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా యాజమాన్యాలు వెంటనే ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చుకోవాలని లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు శ్రవణ్‌కుమార్, విజయ్ కుమార్, కుమారస్వామి, కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో డ్రెస్‌కోడ్ ఏదీ?



వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో డ్రెస్‌కోడ్ పూర్తిగా అమలు కావడం లేదు. దడవాయి, హమాలీ కార్మికులకు డ్రెస్‌లు ప్రతీ ఏడాది రెండు జతల చొప్పున కమిటీ నుంచి ఇస్తున్నప్పటికీ కొందరు మాత్రమే ధరిస్తున్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య మార్కెట్ సందర్శనకు వచ్చిన సమయంలో అక్కడ తూకం వేస్తున్న మిర్చి బస్తాను పరిశీలించారు. ఆ తూకం వద్ద ఎస్‌ఓఎస్ మిషన్‌లో నమోదు చేస్తున్నది దడవాయినా లేక హమాలీ కార్మికుడా, ఖరీదుదారుడి గుమస్తా అన్న విషయం తెలియకుండా ఉంది. ఈ విషయాన్ని ఎవరు గమనించకపోవడం విశేషం. పైగా మార్కెట్‌లో మిర్చి బస్తాలను తూకం వేసి నమోదు చేసేందుకు ఇచ్చిన పీఓఎస్ మిషన్లు సరిగా పనిచేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్కడ ముసలం... ఇక్కడ వాయిదా!

- జెడ్పీ మీటింగ్‌పై భూపాలపల్లి ఎఫెక్ట్
- జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి గైర్హాజర్
- కౌన్సిలర్లను బుజ్జగించేందుకే డుమ్మానా?
- జోరుగా చర్చించుకుంటున్న అధికారులు, రాజకీయ నేతలు
- జిల్లా అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష వాయిదా



సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంపై భూపాలపల్లి మున్సిపాలిటీలో పుట్టిన ముసలం ప్రభావం చూపింది. 21వ తేదీన (శుక్రవారం) జెడ్పీ మీటింగ్ నిర్వహించాలని నిర్ణయించడంతో ఆ మేరకు అన్ని వివరాలతో వచ్చిన అధికారులకు వాయిదా సమాచారం తెలియడంతో అవాక్కయ్యారు. కొందరు ఈ విషయం ముందే తెలుసుకొని అలా వచ్చి ఇలా వెళ్లి పోవడంతో పాటు.. ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో కోరం లేక మీటింగ్ వాయిదా వేస్తున్నట్టు జెడ్పీ సీఈఓ ప్రకటించారు. అయితే భూపాలపల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అక్కడి కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మాణమే ఈ మీటింగ్ వాయిదా పడేందుకు కారణమని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న గండ్ర జ్యోతి భూపాలపల్లి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షురాలుగా ఉండడంతో అక్కడి కౌన్సిలర్లను బుజ్జగించే బాధ్యతను తీసుకున్నారనే టాక్ వస్తోంది. భూపాలపల్లి మున్సిపాలిటీలో పుట్టిన ముసలాన్ని ఆపే ప్రయత్నంలో భాగంగానే వరంగల్ జెడ్పీ సర్వసభ్య సమావేశానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. ఇంకోవైపు శాయంపేట మండలం గోరికొత్తపల్లి మండలంలో మృతుల కుటుంబాలను పరామర్శించడంతో హాజరుకాలేకపోయారని బీఆర్‌ఎస్ కార్యకర్తలు అంటున్నారు. ఏది ఏమైనా జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశానికి అందరూ విభాగాధికారులు హాజరై గంటలపాటు వేచి చూసి వెనక్కి వెళ్లడం గమనార్హం.

ప్రగతి సమీక్షకు మోకాలడ్డు

బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు తమ సొంత అజెండాకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండడంతో జిల్లా ప్రగతి పనులపై సమీక్ష మరింత ఆలస్యం కానుంది. రానున్నది ఎన్నికల కాలం కానుండడంతో జిల్లాలో వివిధ విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష జరగాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు కూడా వారివారి ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సందేహాలు ఉంటే నేరుగా అధికారులను అడిగే అవకాశం ఉంటుంది. అయితే భూపాలపల్లి మున్సిపాలిటీలోనే కాకుండా బీఆర్‌ఎస్ పార్టీకి ప్రతిష్టాత్మకం కావడంతో ఆ లొల్లిని ఆపే పనిలో వరంగల్ జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని చాలా తేలికగా తీసుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎప్పుడు జెడ్పీ సమావేశానికి ముందుండే నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దంపతులు, జెడ్పీటీసీలు ముందస్తు సమాచారంతోనే ఇటువైపు చూడలేదన్న మాటలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య కూడా జిల్లాలోని వివిధ అధికార కార్యక్రమాలకు వెళ్లడం కూడా ముందస్తు సమాచారంతోనేనని అధికారులు చెవులు కొరుక్కుంటున్నారు.

రైతులకు అండగా నిలుస్తున్న కేసీఆర్

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



రైతులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

నల్లబెల్లి: పంటలు నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తున్నది సీఎం కేసీఆరే అని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ముచ్చింపుల, కన్నారావుపేట, నారక్కపేట క్లస్టర్స్ పరిధి గ్రామాల్లో ఇటీవల భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎంపీపీ ఊడుగుల సునీతతో కలిసి ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2,374 ఎకరాల్లో పంటలు నష్టపోయిన 2,021 మంది రైతులకు రూ.1.9 కోట్ల విలువ కలిగిన చెక్కులను అందించినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరఫున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రైతులు తక్కువ సంఖ్యలో హాజరు కావడంతో ఏఓ పరమేశ్వర్‌పై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గందె శ్రీలత, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, తహసీల్దార్ మంజుల, ఏఓ పరమేశ్వర్, సర్పంచ్‌లు బొట్ల సువర్ణ, తంగేళ్ల నిర్మల, గొనే శ్రీదేవి, వక్కల మల్లమ్మ, ఎంపీటీసీ ఎరుకల రవీందర్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు

- తహసీల్దార్ జోక్యంతో పరిష్కారం



వివరాలు తెలుపుతున్న బాధితులు

వర్ధన్నపేట: కల్యాణలక్ష్మి డబ్బులు ఇవ్వకుండా బ్యాంకు రుణానికి జమ చేసుకున్న సంఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణ కేంద్రానికి చెందిన సుగుణ, ఎల్లయ్యలు తమ కూతురు వివాహం సంవత్సరం క్రితం చేశారు. నిరుపేద కుటుంబం కావడంతో కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.1,00,016 చెక్కు మంజూరైంది. ఈ నెల 16న ఎమ్మెల్యే రమేశ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ చెక్కును సుగుణ పట్టణ కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో జమచేశారు. అయితే చెక్కు విత్‌డ్రా చేయాలని బ్యాంకు అధికారులను కోరగా కేవలం రూ.50 వేల నగదు ఇచ్చి మిగతి డబ్బులు రుణంలో జమ చేసుకున్నట్లు చెప్పారు. దీంతో సుగుణ, భర్త ఎల్లయ్యతో కలిసి మీడియా ప్రతినిధులను ఆశ్రయించింది. మీడియా ప్రతినిధులు రుణం సుగుణ ఒక్కరిది కాదని మహిళా సంఘం రుణం అని వివరాలు తెలుసుకుని స్థానిక తహసీల్దార్ రవిచంద్రారెడ్డి వద్దకు వెళ్లి తెలిపారు. స్పందించిన తహసీల్దార్ జిల్లా బ్యాంకు అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బ్యాంకుకు వెళ్లి పూర్తి డబ్బులను విత్‌డ్రా చేసుకోవడంతో కథ సుఖాంతం అయింది. సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి శ్రీభద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలు

- మే 2వతేదీ వరకు ఉత్సవాలు



హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు కల్పించే ఏర్పాట్లపై శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ .. ప్రభుత్వ వివిధ శాఖ అధికారులతో సమీక్షించారు. అధిక ఎండలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు వడదెబ్బ తగలకుండా చలువపందిళ్లు, చల్లని మినరల్‌వాటర్, ప్రథమ చికిత్స కేంద్రం, లైటింగ్ సిస్టమ్, మధ్యాహ్నం ఉచిత అన్నప్రసాదాల వితరణ, క్యూలైన్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రధానార్చకులు భద్రకాళి శేషు, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ విజయలక్ష్మి, సోదా కిరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి కార్యక్రమాలు..

- శనివారం వేదపండితులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, ధ్వజాధివాసం చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. ఉదయం గణపతిసేవ, సాయంత్రం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సేవ ఉంటుంది.
- 23న ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠా, చతుష్టార్చన, వృషభ వాహన సేవ, మృగవాహన సేవ ఉంటాయి.
- 24న మకరవాహనసేవ, చంద్రప్రభసేవ, శ్రీభద్రకాళిభద్రేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుంది.
- 25న శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.
- 26న సూర్యప్రభవాహనసేవ, హంసవాహన సేవ, 27న గురువారం విద్యారణ్యజయంతి, పల్లకిసేవ, శేషవాహనసేవ ఉంటాయి.
- 28న గంధోత్సవం, సాలభంజికసేవ, 29న రథోత్సవం, 30న డోలోత్సవం, భద్రపీఠసేవ, అశ్వవాహనసేవ నిర్వహిస్తారు.
- మే 1న వసంతోత్సవం, చతురస్తసేవ, విమాన సేవ, 2న శరభవాహనసేవ, పుష్పరథసేవ, బ్రహ్మోత్సవాల పూర్ణాహుతి జరగనున్నాయి.

పూర్వ విద్యార్థుల చేయూత అభినందనీయం

- కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

నెక్కొండ: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మన ఊరు- మన బడి కార్యక్రమం ద్వారా పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. నెక్కొండ జెడ్పీ ఉన్నత పాఠశాల 1992–93 పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ. 2.50 లక్షలతో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, ఊయలలను ఏర్పాటు చేయగా శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలన్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులు 70 శాతం పూర్తి అయ్యాయని, మిగతా పనులు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఐఎస్‌ఆర్‌ఓలో ప్రతిభ చాటిన బట్టు నిఖిల్‌వర్మ (9వ తరగతి) విద్యార్థిని కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో డీఈఓ వాసంతి, తహసీల్దార్ డీఎస్.వెంకన్న, సీఐ హథిరాంనాయక్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మండల నోడల్ ఆఫీసర్ సృజన్‌తేజ, హెచ్‌ఎంలు రంగారావు, సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి, జాన్‌నాయక్, పూర్వ విద్యార్థులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, సింగులాల్, తాటిపర్తి అంజన్‌రెడ్డి, కుడికాల శ్రీనివాస్, చల్లా యాకుబ్‌రెడ్డి, రాచకొండ రఘు, ఉల్లేరావు ప్రభాకర్, పులి ప్రసాద్, మహ్మద్ అన్వర్ పాషా, మేర్గు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్

పని దినాల్లో పాఠశాలలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తరగతి గదిలో ఉండడంతో కలెక్టర్ పి.ప్రావీణ్య తప్పుపట్టారు. మండలంలోని పనికర ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో తరగతి గదుల్లో కొందరు వ్యక్తులు ఉండడాన్ని కలెక్టర్ గమనించారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ వాసంతి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అనంతరం మన ఊరు-మన బడి పనులను పరిశీలించారు.

మార్కెట్ అభివృద్ధి పనులకు రూ.10.56 కోట్లు



అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో అభివృద్ధి పనులను మార్కెటింగ్ శాఖ నుంచి రూ.8.56 కోట్లు, పరిపాలన వ్యయానికి రూ.2 కోట్లు (మొత్తం రూ.10.56కోట్లు) ప్రభుత్వం మంజూరు చేసిందని జేడీఎం ఇన్నారపు మల్లేశం తెలిపారు. శుక్రవారం మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య అభివృద్ధి పనులు చేపట్టే ప్రాంతాలను సందర్శించారు. అపరాల యార్డులో సబ్ ఆఫీసు నిర్మాణానికి రూ.47 లక్షలు, మిరప కాయల యార్డు వేలం వేదిక మధ్య స్థలంపై ప్రీ పెయింటింగ్ షీట్‌లతో రూఫింగ్ నిర్మాణానికి రూ.444లక్షలు, వేరుశనగ యార్డులో వేలం ప్లాట్ ఫాం, పసుపు యార్డు మధ్య ప్రీ పెయింటింగ్ షీట్‌లతో రూఫింగ్ నిర్మాణానికి రూ.293 లక్షలు, మార్కెట్ యార్డ్ 2వ గేట్ సమీపంలో 2 ఆర్చీల (స్వాగత ద్వారాలు) నిర్మాణానికి రూ.29 లక్షలు, చిల్లీస్ యార్డు వద్ద ఓహెచ్‌ఎస్‌ఆర్, ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణానికి రూ.43 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నూతన కమిటీ మరికొన్ని అభివృద్ధి పనులను ప్రతిపాదించిందని, వాటిని ఆమోదించి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఆయా పనులు చేపట్టేందుకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు జేడీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ కాలేరు గాంధీ, డైరెక్టర్లు శాంతిరతన్‌రావు, పిన్నింటి వెంకట్రావు, డీఎంఓ ప్రసాదరావు, కార్యదర్శి రాహుల్, చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జడ్జీలకు వీడ్కోలు



జడ్జీలను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

వరంగల్ లీగల్: బదిలీపై వెళ్తున్న వరంగల్ మొదటి అడిషనల్ కోర్టు జడ్జి పావని, ఫ్యామిలీ కోర్టు జడ్జి పద్మజలకు వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వరంగల్ రెండో అడిషనల్ జడ్జి సత్యేంద్ర, హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అధ్యక్షులు వై.శ్యాంసుందర్‌రెడ్డి, ఎలుకుర్తి ఆనంద్‌మోహన్, ప్రధాన కార్యదర్శులు పసుల యాకస్వామి, శ్రీధర్‌రెడ్డి, డీడీపీఓ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు రైల్వే జేఏసీ ధర్మపోరాట దీక్ష

- జేఏసీ నేతలు రాఘవేందర్, నర్సింగరావు

కాజీపేట రూరల్: రైల్వేవ్యాగన్ షెడ్‌కు స్థలమిచ్చి పనులు ప్రారంభించాలన్న డిమాండ్‌తో రేపు (ఆదివారం) రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో ధర్మపోరాట దీక్ష చేపడుతున్నట్లు జేఏసీ కన్వీనర్ దేవలపల్లి రాఘవేందర్, కొండ్ర నర్సింగరావు తెలిపారు. రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్‌లో శుక్రవారం రాత్రి నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో రాఘవేందర్, నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రం కాజీపేటకు మంజూరు చేసిన రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్, రైల్వే వ్యాగన్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ యూనిట్‌కు రూ.586 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వ్యాగన్‌కు 160 ఎకరాలు స్థలం కావాల్సి ఉండగా సెప్టెంబర్ 2021లో అప్పటి కలెక్టర్, ఇతర అధికారులు కలిసి రైల్వే ఏడీఆర్‌ఎంకు 150 ఎకరాలు మ్యూటేషన్ చేసి ఇచ్చి మిగతా 10 ఎకరాలు నాలుగు నెలలో పూర్తి చేస్తామని గడువు ఇచ్చారన్నారు. ఇప్పటివరకు ఆ స్థలం ఇవ్వలేదన్నారు. వ్యాగన్ పరిశ్రమలు ఏర్పడితే దాదాపు 8 వేల మందికి ఉపాధి లభించి ఈ ప్రాంత అభివృద్ధితోపాటు నిరుద్యోగ సమస్య కొంత తీరుతుందన్నారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు జెండా.. ఎజెండా ఒక్కటిగా ఈ ప్రాంత ప్రజల అభివృద్ధిని, నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకొని వ్యాగన్‌లకు కావాల్సిన 10 ఎకరాల స్థలాన్ని ఇప్పించాలన్నారు. ఆదివారం చేపట్టే ధర్మ పోరాట దీక్షకు అన్ని వర్గాల వారు, వ్యాపారస్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైల్వే జేఏసీ నాయకులు అనుమాల శ్రీనివాస్, పాక వేద ప్రకాష్, సాగర్, డి.రవిందర్, లక్ష్మినారాయణ, జి.సుధాకర్‌రావు, కె.సంగమయ్య, ఎంకె.కృష్ణమూర్తి, జి.బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న సారయ్య

చెన్నారావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మాలోతు సారయ్య అన్నారు. ఈ మేరకు మండలంలోని జల్లీ కాలనీ ప్రాథమిక పాఠశాల, చెన్నారావుపేట హైస్కూల్‌లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల రిజిస్టర్, సమ్మెటివ్-2, వార్షిక పరీక్షల మార్కులను పరిశీలించారు. అలాగే విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించారు. వార్షిక పరీక్ష మార్కులు త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ నెల 24న పేరెంట్ టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రొగ్రెస్ కార్డులు అందించాలన్నారు. ఎమ్మార్సీ కార్యాలయాన్ని సందర్శించి దర్జీలకు యూనిఫాం క్లాత్‌లు అందించాలన్నారు. సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రజిని, హమీదా బాను, రవి, శ్రీనివాస్‌రెడ్డి, అనుపమ, నిర్మలదేవి, విజయలక్ష్మి, సరోజ, సిబ్బంది అశోక్, స్వప్న, యాదగిరి, సీఆర్‌పీలు సంపత్, శిల్పలు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్: జిల్లాలో వృత్తి విద్యా కోర్సు ద్వారా పదో తరగతి పాసైన విద్యార్థులు, టీసీసీ కోర్సు చేసిన విద్యార్థులకు ప్రభుత్వం మే 1వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు (42 రోజులు) వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని డీఈఓ వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లాలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని, 18 నుంచి 45 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30 వ తేదీ లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌సీ. తెలంగాణ. జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రాంగణ నియామకాలకు రాతపరీక్ష

కేయూ క్యాంపస్: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ పాల్టెక్ కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ నియామకాల రాతపరీక్షను నిర్వహించింది. 112 మంది విద్యార్థులు పాల్గొనగా 45మంది చివరి రౌండ్ పరీక్షలకు అర్హత సాధించినట్లు నిర్వాహకులు అగ్ని జొన్నలగడ్డ, కార్తీక్, కస్తూరి తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.మహేందర్,, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రమణబాబు లక్ష్మణ్‌నాయక్, శ్రీలత, వాణి,రాజేశ్వరి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

చరణ్‌కు కన్నీటి వీడ్కోలు

కాశిబుగ్గ: బస్సు చక్రాల కింద పడి మృతి చెందిన కాశిబుగ్గలోని హరిజనవాడకు చెందిన చింత చరణ్(17) అంత్యక్రియలు శుక్రవారం కాలనీలోని శ్మశాన వాటికలో జరిగాయి. కుటుంబీకులు, బంధుమిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు.

సమష్టి కృషితో లోకోషెడ్ అభివృద్ధి

- రైల్వే సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్
- ముగిసిన గోల్డెన్ జూబ్లీ వేడుకలు
- రైల్వే కార్మికులకు మెమొంటోలు ప్రదానం

కాజీపేట రూరల్: భారతీయ రైల్వేలో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన డీజిల్ లోకో షెడ్ భవిష్యత్ అభివృద్ధికి అందరం సమష్టి కృషి చేస్తామని షెడ్ సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్ అన్నారు. కాజీపేట డీజిల్ లోకో షెడ్ కాకతీయ కళావేదికపై శుక్రవారం గోల్డెన్ జూబ్లీ ముగింపు వేడుకలు పండుగలా జరిగాయి. ఈ కార్యక్రమంలో సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. డీజిల్ షెడ్ అభివృద్ధికి రైల్వే కార్మికులు ఎంతో కృషి చేస్తున్నారని రైల్వేలో ఆదర్శవంతమైన షెడ్ అభివృద్ధి కోసం కృషి చేస్తామని షెడ్‌లో పని చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం 1973 నాటి మొదటి బ్యాచ్ కార్మికులకు, ప్రస్తుత రైల్వే కార్మికులందరికీ గోల్డెన్ జూబ్లీ వేడుకల మెమొంటోలు ప్రదానం చేశారు. అనంతరం రైల్వే కార్మికులు, కార్మికులు కుటుంబాలు, వారి పిల్లలు కలిసి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం రైల్వే కార్మికులు, కార్మికుల కుటుంబాలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎంఈ హనుమానాయక్, ఏడీఎంఈలు భానుప్రకాశ్, నాగరాజశేఖర్, ఏసీఎంటి రవీంద్రకుమార్, ఎం.రాజశేఖర్, ఈఎఫ్ రమేశ్‌కుమార్, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు వేదప్రకాశ్, ఎస్‌కె.జానీమియా, గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, భిక్షపతి, రైల్వే సంఘ నాయకులు ఎ.మధుసూదన్‌రావు, వి.జగదీశ్వర్, ఎ.శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ నాయకులు శ్రీనుబాబు, ఆర్.శ్రీనివాస్‌నాయక్, దేవేందర్, రైల్వే ఓబీసీ నాయకుడు ఎ.సంతోశ్‌కుమార్, శ్యామ్ కార్మికులు పాల్గొన్నారు.



రైల్వే సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్ సమక్షంలో వీల్‌చైర్‌ను అందజేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

షెడ్‌కు వీల్‌చైర్ అందజేత

జూబ్లీ వేడుకల సందర్భంగా రైల్వే షెడ్ కార్మికుల అత్యవసర సౌకర్యార్థం రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరి సీహెచ్.శంకర్‌రావు వీల్ చైర్ బహూకరించారు. వీల్‌చైర్‌ను సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్ సమక్షంలో పంపిణీ చేసినట్లు మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ చైర్మన్ పి.వేదప్రకాశ్ తెలిపారు.

రాజ్యాంగ సంస్థల్ని విచ్ఛిన్నం చేస్తున్న మోదీ

- ప్రజా రచయిత్రుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే

ఖిలా వరంగల్: చారిత్రక పోరాటాల ద్వారా నిర్మించుకున్న భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థలను మోదీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తోందని ప్రజా రచయిత్రుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. శుక్రవారం వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఇసుక అడ్డా జంక్షన్ సమీపంలోని రాజశ్రీ గార్డెన్‌లో వరంగల్ జిల్లా స్వేచ్ఛ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 'మత తత్వ సమాజం వద్దు.. మానవీయ సమాజాన్ని నిర్మించుకుందాం' పేరిట జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కాత్యాయనీ విద్మహే, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర నేత బి.రమాదేవి మాట్లాడుతూ.. ఉత్తర భారతదేశంలో జరుగుతున్న కుల, మత ఉన్మాద దాడులు దేశ లౌకికత్వాన్ని ప్రశ్నిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. బాలరాజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, న్యూడెమొక్రసీ నేత నున్న అప్పారావు, ఎంసీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, ప్రజా పంథా జిల్లా నేత రాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్, నాయకులు అరూరికుమార్, జీడి.సారయ్య, సింగి ఏలేందర్, పాణి, భవాని రోహిళ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే

పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తే ఊరుకోం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

జనగామ రూరల్: జనగామలోని శామీర్‌పేట శివారులో 2012–13 గత ప్రభుత్వం 1,144 మంది ఇళ్ల పట్టాల సర్వే పేరుతో ఇందిరమ్మ లబ్ధిదారులను మోసం చేసే కుట్ర చేయడం సరికాదని, సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శుక్రవారం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మూడో విడత ఇందిరమ్మ గుడిసె వాసుల కాలనీని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన గుడిసెవాసులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టుకోవడానికి పట్టాలు పంపిణీ చేసిందని, ప్రజాప్రతినిధులు, అధికారులు 2018లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం.. పేదలకు డబుల్ బెడ్ రూంలు ఇస్తామని మోసం చేశారన్నారు. పట్టాలు ఉన్న వారికి కాకుండా.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇస్తామని చెప్పడం, కొత్తగా సర్వే చేయడం లబ్ధిదారులను మోసం చేయడమే అన్నారు. పట్టా ఆధారంగా ప్రభుత్వం ఆలోచించి డబుల్‌బెడ్రూమ్ అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తే ఊరుకోమని, పార్టీ పేదలకు అండగా పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, వెంకట్రాజం, అహల్య, రాపర్తి రాజు, యాదగిరి, శేఖర్, కళ్యాణ లింగం, వెంకటమల్లయ్య, లలిత, రజిత, శంకర్, ఉమా, చందు తదితరులున్నారు.



పేదలతో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

వితంతువును మోసం చేసిన యువకుడు

- ఆమె నాలుగు నెలల గర్భిణి
- పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

హసన్‌పర్తి: ఓ వివాహితను పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఆమె గర్భం దాల్చడంతో ముఖం చాటేశాడు. ఈమేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. 65వ డివిజన్ చింతగట్టులోని సుభాశ్‌నగర్ ప్రాంతానికి ఓ యువతికి ఎనిమిదేళ్ల క్రితం హుజూరాబాద్‌కు చెందిన ఓ యువకుడితో వివాహం జరిగింది. ఏడాది క్రితం ఆయువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ వ్యవహారంలో భార్యనే నిందితురాలిగా పేర్కొన్నారు. ఈక్రమంలో ఒంటరిగా ఉన్న ఆ వితంతువును అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. శారీరక సంబంధాన్ని ఏర్పర్చుకోవడంతో ఆమె గర్భందాల్చింది. తనను పెళ్లి చేసుకోవాలని ఆమె పట్టుబట్టడంతో యువకుడు పెళ్లికి నిరాకరించాడు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ.. శుక్రవారం బాధితురాలు కాకతీయ యూనివర్సిటీ పోలీసులను ఆశ్రయించింది. ఈమేరకు పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. నాలుగు రోజులైనప్పటికీ పోలీసులు మాత్రం స్పందించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకోవాలని సలహా ఇస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

భర్త ఆచూకీ తెలుసుకుని అప్పగించండి



కుమార్

వర్ధన్నపేట: భర్త ఆచూకీ తెలుసుకుని అప్పగించాలని కోరుతూ.. ఓ మహిళ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సీనపెల్లి కుమార్‌తో కళ్యాణికి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు. బాబు పుట్టినప్పటి నుంచి కళ్యాణి హనుమకొండలోని పుట్టింట్లో ఉంటోంది. ఈక్రమంలో కుమార్ ప్రైవేట్ జాబ్ చేస్తూ ఉప్పరపల్లిలో నివాసం ఉంటున్నాడు. కుమారుడి పుట్టు వెంట్రుకల గురించి మార్చి 31న కుమార్ కళ్యాణితో మాట్లాడాడు. అనంతరం ఏప్రిల్ 3న మెసేజ్ చేశాడు. ఆ తర్వాత కళ్యాణికి భర్త నుంచి ఎలాంటి ఫోన్ రాకపోవడంతో ఆమె ఫోన్ చేసింది. పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ ఫోన్ స్విచాఫ్ రావడంతో కళ్యాణి, తన తండ్రిని ఉప్పరపెల్లికి పంపించి భర్త గురించి వాకబు చేసింది. కుమార్ వేరే అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను తీసుకువెళ్లినట్లుగా తెలుసుకుంది. అనంతరం ఆమె ఉప్పరపల్లికి వచ్చి బంధువులతో మాట్లాడి భర్త ఆచూకీ కోసం ప్రయత్నించింది. భర్త ఆచూకీ ఎక్కడా దొరక్కపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



ఘటనాస్థలిలో బండి చిన్న ఎల్లగౌడ్

వరంగల్(పర్వతగిరి): మండలంలోని రావూరు గ్రామంలో శుక్రవారం తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు బండి చిన్న ఎల్లగౌడ్(60) మృతి చెందాడు. రోజూమాదిరిగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా.. ఎల్లాగౌడ్ తాటి చెట్టుపై నుంచి పడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు స్థానిక సర్పంచ్ బండి సంతోశ్‌గౌడ్ తెలిపారు.

వడదెబ్బతో 9 నెలల బాలుడు మృతి

- చిన్నవడ్డేపల్లి చెరువు గుడిసెల్లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

వరంగల్: నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు శిఖం భూముల్లో వేసిన గుడిసెలో తల్లితో ఉంటున్న 9నెలల బాలుడు వడదెబ్బతో చనిపోయాడు. ఐదు రోజుల క్రితం జరగ్గా, ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తెలిసిన సమాచారం ప్రకారం.. భూమిలేని నిరుపేదలకు నివేశన స్థలాలు ఇప్పించేందుకు వామపక్ష పార్టీలు చేపట్టిన భూపోరాటంలో భాగంగా చిన్నవడ్డేపల్లి చెరువు శిఖం భూముల్లో గుడిసెలు వేశారు. ఒక్కొక్కరికి 60 గజాల స్థలం కేటాయిస్తామని, ఆ గుడిసెల్లో ఉన్న వారు మాత్రమే అర్హులని చెప్పడంతో రాత్రి, పగలు అందులోనే ఉంటున్నారు. ఓ తల్లి తన 9నెలల పసిబాలుడితో గుడిసెలో ఉంటున్నట్లు సమాచారం. ఎండవేడిమికి ఐదు రోజుల క్రితం వడదెబ్బ తాకడంతో చిన్నారి బాలుడు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. విషయం బయటకు చెబితే ప్లాట్ రాదని కొందరు హెచ్చరించడంతో ఆ తల్లి ఎవరికీ చెప్పకుండా కుమారుడికి అంత్యక్రియలు చేసినట్లుగా సమాచారం. ఈ విషయమై ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌ను వివరణ కోరగా వడదెబ్బతో బాలుడు మృతిచెందినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కానీ ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

రోడ్డు దాటుతూ ఒకరి దుర్మరణం



ప్రభాకర్(ఫైల్)

చిల్పూరు: మండలంలోని నష్కల్ గ్రామ బస్ స్టేజీ సమీపంలో రోడ్డు దాటుతూ శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొని నష్కల్ గ్రామానికి చెందిన గుర్రాల ప్రభాకర్‌రెడ్డి (55) అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల సమీపంలో ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లు లేని పేదలు గుడిసెలు వేసుకున్నారు. అందులో ప్రభాకర్ కూడా గుడిసె వేసుకున్నాడు. అప్పటి నుంచి ప్రతీ రోజు గుడిసెల్లో రాత్రి పడుకుని ఉదయం ఇళ్లకు వెళ్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం లేచి హాజరు వేసుకుని టార్చిలైట్‌తో ఇంటికి బయల్దేరాడు. హైదరాబాదు–హనుమకొండ జాతీయ రహదారి దాటుతుండగా.. హైదరాబాదు నుంచి వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ప్రభాకర్‌రెడ్డిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిపారు.

మృతదేహం చెల్లాచెదురు..

రోడ్డు ప్రమాదంలో ప్రభాకర్‌రెడ్డి మృతదేహం నుజ్జునుజ్జయ్యింది. అవయవాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈవిషయం తెలుసుకున్న సర్పంచ్ కర్ణకంటి స్వప్న వెంకటేశ్, ఎంపీటీసీ పాశం శిరీషసురేశ్, శాగంటి మణి, కర్ణకంటి మహేశ్, రంగు రాజు తదితరులు ఘటనాస్థలికి చేరుకున్నారు. చెల్లా చెదురుగా ఉన్న మృత దేహాన్ని ఒకదగ్గరకు చేర్చారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు..



చక్రు(ఫైల్)

కేసముద్రం: మండలంలోని తావుర్యా తండాకు చెందిన భుక్యా చక్రు(50) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. చక్రు ఎప్పటిలాగే మూల స్తంభం తండా సమీపంలోని తన పంటపొలం వద్దకు ఎడ్లను మేపేందుకు వెళ్లాడు. ఎడ్లు మేస్తూ బావి దరివైపునకు వెళ్లాయి. గమనించిన చక్రు ఎడ్లను పక్కకు తరిమే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి నీటమునిగాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. చక్రు మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు రోదించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

దశ దినకర్మకు వచ్చి కుప్పకూలిపోయాడు

మరిపెడ రూరల్: స్నేహితులతో కలిసి దశదిన కర్మకు హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా ఆశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన కోటపాటి విజేందర్ (35) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. విజేందర్ తన స్నేహితుడి బంధువుల దశ దినకర్మకు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల వీరారం గ్రామానికి వచ్చాడు. బహిర్భూమికి వెళ్లి కుప్పకూలిపోయాడు. స్నేహితులు వెంటనే విజేందర్‌ని లేపగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

JAI BHARATH STUDY HALL

జై భారత్ స్టడీ హాల్ కాజీపేటలో ప్రారంభం పోటీ పరీక్షలు & అనేక రకాల ప్రవేశ పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థుల ఉద్యోగ అభ్యర్థుల కోసం సంప్ర॥ HP పెట్రోల్ పంప్ ప్రక్కన, బాపూజీనగర్, కాజీపేట. 8690869052 [W-785488]

REAL ESTATE

FLAT FOR SALE

LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్ 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3176]

KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26935]

HOUSE FOR SALE

ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26936]

వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26937]

ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26938]

ఎత్తైన మామునూర్‌లో 40 ఫీట్ల తూర్పు దక్షిణ కార్నర్ రోడ్లతో 390 చ.గజాల G+1, 1586 చ.ఫీట్ల ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785524]

PLOT FOR SALE

GWMC - KUDA పరిధిలోని 3300 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్ మేన్‌గేట్‌కి ఎదురుగా 2 సైడ్ రోడ్స్ ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-785523]

మామునూర్ సెంటర్లో 347 చదరపు గజాల నార్త్ ఈస్ట్ కార్నర్ ప్లాటుకై సంప్రదించవల్సిన సెల్ నెం: 9032111600. [W-785515]

SERVICES

LOANS

హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ ఋణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-785473]

WANTED

Wanted Female Telecallers for Leading a Banking Channel. Salary 10K. Q: Any Degree, Direct Job. Not a Consultant, No Fee. Cont: 7396195324. [WA-5364]

వరంగల్ అండర్ బ్రిడ్జ్ దగ్గర గల గణేష్ ఆయిల్స్‌లో పనిచేయుటకు అనుభవం మరియు లైసెన్స్ కల్గిన ఆటో డ్రైవర్ కావలెను. సంప్ర॥ 9440171643. [WA-6949]

Wine Shop లో పని చేయుటకు వర్కర్స్ కావలెను. హసన్‌పర్తి మరియు కమలాపూర్. వెంటనే సంప్రదించండి. సెల్: 9182922080. [WA-13017]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785870]

పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్స్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9059630792 [HA-6126]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K-18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్:9640528889, [H-793415]



సాధారణంగా అందరూ కాఫీ లేదా గరం గరం చాయ్‌తో రోజును ప్రారంభిస్తారు. అందులో కొత్తేమీ లేదు. బండిలో పెట్రోలు పోయకపోతే బండి ముందుకు కదలనని మొరాయించినట్లే ఇది కూడా! అయితే ఇది వేసవి కాబట్టి అలా కాఫీ, టీ లకు బదులుగా పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఒక గ్లాసు ఆరోగ్యకరమైన పానీయం తాగటం చాలా మంచిదని అంటున్నారు నిపుణులు. కావాలంటే ఓ అరగంట గ్యాప్ ఇచ్చి, యథావిధిగా కాఫీనో, టీనో తాగచ్చు. అలా తాగడం ద్వారా ఉదయం పూట రిఫ్రెషింగ్ గా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. అలాంటి గుడ్ మార్నింగ్ డ్రింక్స్ కొన్నింటిని చూద్దాం.

మార్నింగ్ డ్రింక్‌తో రోజంతా హుషారుగా



తేనె- దాల్చిన చెక్క పానీయం

ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడిని వేసి తాగాలి. ఇది మిమ్మల్ని రిఫ్రెష్ చేస్తుంది. కడుపును శుభ్రం చేస్తుంది.



నిమ్మరసం

ఒక గ్లాసు నిమ్మరసం సహజంగా శరీరంలో టాక్సిన్స్ ఏమీ లేకుండా చేస్తుంది. ఇది ఉదయం వేళ టీ లేదా కాఫీకి కూడా మంచి ప్రత్యామ్నాయం. గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగాలి, రుచి కోసం కొంచెం తేనెను కూడా కలపవచ్చు.



దాల్చిన చెక్క గ్రీన్ టీ

గ్రీన్ టీ తాగితే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ, కడుపు సమస్యలను నివారించడానికి, మీరు శుభోదయ పానీయంగా కప్పు గ్రీన్ టీ తాగవచ్చు. గ్రీన్ టీ రుచి ఇష్టం లేకపోతే అందులో ఒక చిటికెడు దాల్చిన చెక్క పొడి, తేనె కలిపితే సరి. ఆ పానీయాన్ని ఆస్వాదించవచ్చు.



కొబ్బరి నీరు

కొబ్బరి నీరు చాలా ఆరోగ్యకరమైన పానీయం. అప్పుడప్పుడూ ఉదయం పూట కొబ్బరి నీరు తాగుతుంటే మీకు మార్నింగ్ ఎనర్జీ డ్రింక్‌గా మాత్రమే కాదు, మీ శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేసే రుచికరమైన పానీయం. సాదా కొబ్బరి నీరు తాగండి, ఇందులో ఏమీ కలపాల్సిన అవసరం లేదు.



అలోవెరా జ్యూస్

చాలారకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులు కలబంద ఆధారితమైనవే ఉంటాయి. ఉదయం పూట కలబంద జ్యూస్ తాగటం ఎంతో ఉత్తమం. ఈ పానీయం ఉదయాన్నే తాగిన తరువాత, మీ శరీరం తక్షణమే చైతన్యం అవుతుంది. మీరు మీ రోజును ప్రారంభించడానికి తగిన తక్షణ శక్తి వస్తుంది. అంతేకాదు, చర్మసమస్యలు అన్నీ పోయి, మెరిసే చర్మం వస్తుంది.

దోసకాయ... పుదీనా జ్యూస్

దోసకాయ పుదీనా నీరు జ్యూస్ డిటాక్సింగ్ డ్రింక్. మీ శరీరం నుంచి మలినాలను, విషపదార్థాలను తొలగిస్తుంది. ఉదయం పూట మిమ్మల్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. మీ ఆరోగ్యకరమైన ఉదయం దినచర్యకు ఇది మంచి డ్రింక్. ముఖ్యంగా వేసవిలో పుదీనాతో కలిసిన దోసకాయ డ్రింక్ మీ శరీరాన్ని చల్లబరుస్తుంది.



రోజ్ షర్బత్

ముందుగా సబ్జా గింజలను నీటిలో నానబెట్టండి, ఈ లోపు రోజ్ సిరప్ సిద్ధం చేసుకోండి. ఒక గుప్పెడు తాజా గులాబీ పువ్వు రెమ్మలను తీసుకొని ఒక గిన్నె నీటిలో ఉడికించండి. మరొక గిన్నెలో చక్కెర, నీరు కలిపి చక్కెర పాకం తయారు చేయండి. చక్కెర పాకంలో ఉడికించిన గులాబీ నీరు ఫిల్టర్ చేసుకొని బాగా కలిపేస్తే రోజ్ సిరప్ రెడీ. ఇప్పుడు మెత్తగా నానబెట్టిన సబ్జా గింజలను వడకట్టి ఒక గ్లాసులోకి తీసుకోండి.అందులో రోజ్ సిరప్, ఐస్ క్యూబ్స్, కోల్డ్ వాటర్ వేసి కలపండి, పై నుంచి నిమ్మరసం పిండుకోండి. అంతే, రోజ్ షర్బత్ రెడీ.

వేసవి అంతా రోజూ ఉదయం పూట ఇలాంటి ఏదైనా ఒక పానీయం తాగటం ద్వారా మీరు రోజంతా చురుకుగా, హుషారుగా ఉంటారు.

మీకు తెలుసా?

మొలకెత్తిన బంగాళదుంపలు తింటే మన ఆరోగ్యానికే పెను ముప్పు తెచ్చిపెడతాయి. బంగాళదుంపలపై వచ్చే మొలకలు విషపూరితమైనవని చెబుతున్నారు నిపుణులు. ఒక్కోసారి ఫుడ్ పాయిజన్‌కి దారి తీసి ప్రాణాల మీదకు కూడా తెస్తుంది. బంగాళదుంపలపై ఏర్పడే మొలకల్లో గ్లైకో అల్కాయిడ్స్ అనే విషపూరితమైన రసాయన పదార్థాలు ఉంటాయి. మొలకెత్తిన బంగాళదుంపల్లో అధిక స్థాయిలో ఈ రసాయన పదార్థం ఉంటుంది. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇవి తిన్న కొద్ది గంటలలోనే వాంతులు, విరోచనాలు, పొత్తి కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా లో బీపీ, పల్స్ ఎక్కువగా కొట్టుకోవడం, జ్వరం, తల నొప్పి, మతిమరుపు.. కడుపులో నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన ఆలుగడ్డలను గర్భిణీలు తింటే పుట్టబోయే బిడ్డపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. బంగాళదుంపలను చల్లని, చీకటి ప్రదేశాల్లో నిల్వ ఉంచడం ద్వారా అవి మొలకెత్తడాన్ని నివారించవచ్చు.



ఎండలో కంటికి అండగా...



వేసవి కాలంలో చర్మానికి సంబంధించిన సమస్యలే కాదు, కళ్లకు సంబంధించిన సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తాయి. ఎండవేడిమికి గురికావడం వల్ల కళ్లు పొడిబారడం లేదా మంటలు పుట్టడం, ఎర్రబారడం వంటి సమస్యలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడంతోపాటు కొన్ని రకాల ఆహార పానీయాలు తీసుకోవడం మంచిది. అవేమిటో చూద్దాం.

కంటి ఆరోగ్యాన్ని కాపాడే వాటిలో నిమ్మరసం కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎండలనుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాకుండా, కళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పనిని కూడా చేస్తుంది. ఎందుకంటే, నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కళ్ళను రక్షిస్తుంది. అంతే కాదు, నిమ్మకాయలో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది దృష్టిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మరసంలో ఉండే లుటిన్, జియాక్సంతిన్ అనే ముఖ్యమైన పోషకాలు మాక్యులర్ డీ జనరేషన్, కంటిశుక్లం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. నిమ్మకాయలో ఉండే విటమిన్ సి కళ్ల రక్తనాళాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇది రెటీనాకు రక్త ప్రసరణ జరిగేలా చూస్తుంది. తద్వారా కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఇంకా పుచ్చకాయ, కర్బూజ, మామిడి, బొప్పాయి పండ్లు తినడం, కొబ్బరినీళ్లు తాగడం, ఆహారంలో ఉల్లిపాయలను బాగా ఉపయోగించడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

కళ్లు మంటలు ఉన్నప్పుడు కాసిని మల్లెపూలను ఒక గ్లాసు నీళ్లలో వేసి అరగంట తర్వాత ఆ నీటితో కళ్లను కడుక్కుంటే ఉపశమనం కలుగుతుంది. అలాగే, చక్రాలుగా తరిగిన కీరాముక్కలను లేదా బంగాళదుంప ముక్కలను కళ్ల మీద ఉంచుకోవడం కూడా ప్రయోజనకరం. కొంతమందికి రాత్రిపూట కళ్లు కనిపించవు. ఈ వ్యాధిని రేచీకటి అంటారు. ఆహారంలో విటమిన్ ఎ ఆధారిత ఆహారాన్ని తక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. దీనిని నివారించాలంటే పాలకూర, బొప్పాయి, క్యారెట్ ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరల్లో తోటకూర, పొన్నగంటి కూర కంటికి చాలా మంచిది.

ఈ కాలంలో వీచే వడగాలులు చాలా ప్రమాదకరం. వేడిమికి కళ్లల్లో ఉండే తేమ ఆవిరైపోతుంది. ఫలితంగా కంటి వద్ద చర్మం పొడిబారి, కళ్లల్లో ఇసుక వేసినట్లుగా ఉంటుంది. గాలులకు దుమ్ము, ధూళి కంట్లో పడడం వల్ల కళ్ల దురద, మంటలు వస్తాయి. అందువల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సన్ గ్లాసులు పెట్టుకోవాలి. ఇంటికి చేరిన వెంటనే చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి.

హెల్త్ టిప్స్



అల్లం అంగుళం ముక్క, బెల్లం చిన్న ముక్క తీసుకుని రెండూ కలిపి రాత్రి పడుకోబోయేముందు నమిలి తింటే మల బద్ధకం పోతుంది.



మెంతికూర చిన్నదిగాని, పెద్దదిగాని కూర చేసుకుని రోజూ కనీసం మూడు నెలలు తింటే రక్తహీనత తగ్గుతుంది.



వేపనూనె, కర్పూరం కలిపి రాస్తే తలలోని కురుపులు మాడిపోతాయి, చుండ్రు తగ్గుతుంది.

మొదటి విమాన ప్రయాణమా?

మొదటిసారి విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు చాలా ఆసక్తిగా ఉంటుంది. విమాన ప్రయాణం చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో అలర్ట్‌గా ఉండాలి. ఏమీ తినకుండా లేదా ఫుల్లుగా తిని విమాన ప్రయాణం చేయకూడదు. ముఖ్యంగా కొన్ని ఆహారపదార్థాలకి దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం...




విమానంలో ప్రయాణించే ముందు బిర్యానీ, ఊరగాయలు వంటి ఆయిల్, స్పైసీ ఫుడ్ తింటే కడుపు నొప్పి వస్తుంది. గుండె మంట, మూత్రాశయం చికాకు సమస్యలు వస్తాయి. ఇవిఅధిక కేలరీలను కలిగి ఉండటంతోబాటు వీటి మూలాన నోటి నుంచి వాసన వస్తుంది. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌లో కంటికి ఇంపుగా నోరూరిస్తూ కనిపించే రకరకాల ప్యాకేజ్ ఫుడ్ తీసుకోవడం అసలు మంచిది కాదు. ప్రయాణించే ముందు బర్గర్ లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల అరుగుదల సరిగా లేక గుండెల్లో మంట వస్తుంది. అలాగే ఆపిల్ తినడమూ అంత మంచిది కాదు. ఎసిడిటీ లేదా గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. యాపిల్స్‌లో చక్కెర అధికంగా ఉండటం వల్ల అది పేగు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే బొప్పాయి లేదా నారింజ పండ్లను తినవచ్చు. చాలామంది ఫ్లైట్ ఎక్కే ముందు ఏదో ఒక రకమైన స్నాక్స్ తింటారు. అయితే ఆరోగ్యనిపుణుల అభిప్రాయం ప్రకారం స్నాక్స్ అజీర్ణం, వికారం లేదా ఉబ్బరం కలిగిస్తాయి. అలాగే విమాన ప్రయాణానికి ముందు బ్రోకలీతో చేసిన ఆహారాలు కూడా తినకూడదని గుర్తుంచుకోండి.

సినిమా

ఆటకు వేళాయె అంటూ కొందరు స్టార్స్ ప్లేయర్స్‌గా మారారు. క్రికెటర్లుగా, కోచ్‌లుగా మౌల్డ్ అయిపోయారు. అయితే ఈ ఆట అంతా సినిమాల కోసమే. ప్రస్తుతం క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. కొన్ని కాల్పనిక కథలు కాగా, కొన్ని బయోపిక్స్ కూడా ఉన్నాయి. ఇక వెండితెరపై క్రికెటర్లుగా అలరించనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

ఆటకు వేళాయె



● రజనీకాంత్


● సూపర్ స్టార్ రజనీకాంత్ ఓ క్రికెట్ మ్యాచ్ నిర్వహణ మీద ఉన్నారు. 'లాల్ సలామ్' చిత్రం కోసమే ఇదంతా. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణువిశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్‌లో, రజనీకాంత్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ క్రికెట్ కోచ్ పాత్రలో కనిపిస్తారనీ, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధిగా కనిపిస్తారనీ ప్రచారం జరుగుతోంది. మరి.. రజనీ ఏ పాత్రలో కనిపిస్తారో చూడాలి. 'లాల్ సలామ్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.



● సిద్ధార్థ్



● నయనతార



● మాధవన్

● క్రికెట్ గ్రౌండ్‌లో బిజీగా ఉంటున్నారు మాధవన్, సిద్ధార్థ్, నయనతార. ఈ ముగ్గురూ కలిసి సిల్వర్ స్క్రీన్‌పై ఆడనున్న మ్యాచ్ 'ది టెస్ట్'. తమిళ నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో నయనతార, మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

● శ్రీలంక మాజీ క్రికెటర్, స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ '800' టైటిల్‌తో తెరకెక్కుతోంది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంలో సలీమ్ మాలిక్ పాత్ర చేసిన మధుర్ మిట్టల్ ఈ చిత్రంలో మురళీధరన్ పాత్ర చేస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. "మురళీధరన్ జీవితంలోని పలు కోణాలను ఈ చిత్రంతో వెండితెరపై ఆవిష్కరించనున్నాం. 800 వికెట్లు తీసిన ఏకైక ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మురళీధరన్ పేరిట రికార్డు ఉంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● మధుర్ మిట్టల్

● భారత ప్రముఖ మాజీ క్రికెటర్ జులన్ గోస్వామి జీవితం ఆధారంగా రూపొందిన వెబ్ మూవీ 'చక్దా ఎక్స్‌ప్రెస్'. ఇందులో జులన్ గోస్వామిగా అనుష్కా శర్మ నటించారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. పశ్చిమ బెంగాల్ చక్దా ప్రాంతానికి చెందిన జులన్ గోస్వామి దాదాపు రెండు దశాబ్దాలు మహిళా క్రికెటర్‌గా, కెప్టెన్‌గా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను లీడ్ చేశారు. ఉమెన్స్ వన్ డే ఇంటర్‌నేషనల్ క్రికెట్ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జులన్ రికార్డు సాధించారు.



● అనుష్కా శర్మ

● యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ సైతం క్రికెట్ బ్యాట్ పట్టారు. 'మిస్టర్ అండ్ మిస్ట్రస్ మహి' సినిమాలో జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటిస్తున్నారు. రాజ్‌కుమార్ రావ్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. రియల్ క్రికెటర్స్ దగ్గర శిక్షణ తీసుకుని జాన్వీ కపూర్ ఈ సినిమా చేశారు. వీరితోపాటు మరికొందరు క్రికెటర్ల బయోపిక్‌లు, క్రికెట్ ఆధారంగా సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.



● జాన్వీ కపూర్

టైమ్‌లెస్ లవ్!



హీరో నాగచైతన్య–డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందుతున్న తెలుగు–తమిళ చిత్రం 'కస్టడీ'. కృతీ శెట్టి కథానాయిక. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా మే 12న రిలీజ్ కానుంది. ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్‌శంకర్ రాజా స్వరపరచిన ఈ చిత్రంలోని 'టైమ్‌లెస్ లవ్..' అంటూ సాగే పాటని రేపు (ఆదివారం) రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. "భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో 'కస్టడీ' తెరకెక్కుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: పవన్ కుమార్, కెమెరా: ఎస్ఆర్ కదిర్.

వీళ్లందరూ మిస్ అవలేదు..




● 'అల్లరి' నరేశ్

'నిన్న రాత్రి నుంచి మా నాన్న కనిపించడం లేదు సార్', 'రెండు వారాల నుంచి మా అబ్బాయి కనిపించడం లేదు సార్' అనే డైలాగులతో 'ఉగ్రం' సినిమా ట్రైలర్ విడుదలైంది. 'నాంది' వంటి హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఉగ్రం'. మిర్నా మీనన్ కథానాయికగా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదల చేశారు. 'వీళ్లందరూ మిస్ అవలేదు.. మిస్ చేయబడ్డారు. అందులో నా భార్య, కూతురు కూడా ఉన్నారు ('అల్లరి' నరేశ్), 'చీకట్లో జరిగే వ్యాపారం.. చీకట్లోనే వదిలెయ్. (విలన్ పాత్రధారి)' వంటి డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. "యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఉగ్రం'. నరేశ్ పాత్రను విజయ్ కనకమేడల ఇంటెన్స్‌గా చూపించారు. 'నాంది'లా 'ఉగ్రం' కూడా మంచి హిట్ అవుతుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సిద్, సంగీతం: శ్రీచరణ్ పాకాల.


వినోదాత్మకంగా...

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్గమాన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్పాల దర్శకత్వంలో డా. బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నేత అద్దంకి దయాకర్ కీలక పాత్రలు పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. బత్తిని కీర్తిలత మాట్లాడుతూ– "ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ మధ్య ప్రివ్యూ షో చూసిన సినీ, రాజకీయ ప్రముఖులు బాగుందని అభినందించారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్రంలోని 'ఎల్లమ్మ..' పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. మంచి కథను కామెడీగా చెప్పడంతో ప్రేక్షకులకు మా సినిమా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



● సుధాకర్ రెడ్డి

వాస్తవ ఘటన ఆధారంగా....



● రాజీవ్ కనకాల

అనిరుధ్, యశస్విని జంటగా, రాజీవ్ కనకాల, జీవా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది.

భిక్షపతి రాజు మాట్లాడుతూ– "వాస్తవ ఘటన స్ఫూర్తితో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని పాత్రలన్నీ సహజంగా ఉంటాయి. సీనియర్ నటులు జీవా, రాజీవ్ కనకాల నటన హైలైట్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు.

చూపు తిప్పిందేంటి?

'తెలుగు ఇండస్ట్రీ కన్నడపై చూపు తిప్పిందేంటి?' అనే డైలాగ్‌తో 'మళ్ళీ పెళ్లి' సినిమా టీజర్ విడుదలైంది. వీకే నరేష్, పవిత్రా లోకేష్ జోడీగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎంఎస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేష్ నిర్మిస్తున్నారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మధువే' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'అతను భార్యని ఎలా చూసుకోవాలో, భార్య విలువేంటి? అని తెలియని ఒక మృగం' (వనితా విజయ్ కుమార్), 'చుట్టూ అప్పులు, ఒంటినిండా రోగాలు పెట్టుకున్న నీతో సరసం ఏంటి?' (వీకే నరేశ్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. "ఆసక్తికరమైన కథలను ఎంచుకుంటున్న ఎంఎస్ రాజు మరో విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ వేసవిలో తెలుగు, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. జయసుధ, శరత్ బాబు, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.



● పవిత్ర, నరేశ్

డాక్టర్ రేణు

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో డాక్టర్ రేణు పాత్రలో హీరోయిన్ రుహానీ శర్మ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. 'చిలసౌ, హిట్: ది ఫస్ట్ కేస్, డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు రుహానీ శర్మ. 'శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'హిట్: ది ఫస్ట్ కేస్'లో హీరోయిన్‌గా నటించారు రుహానీ. ఇప్పుడు మరోసారి ఆయన దర్శకత్వంలో 'సైంధవ్'లో డాక్టర్ రేణుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీని ఈ చిత్రంతో తెలుగుకి పరిచయం చేస్తున్నాం. ప్రస్తుతం 'సైంధవ్' షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్.



● రుహానీ శర్మ